

## మెకెయిన్ - ఒబామా పరుగుల పోటీ

'అదేంటి! వీళ్ళిద్దరూ అమెరికా అధ్యక్ష పదవికి కదా పోటీ పడుతున్నది, మరి ఈ పరుగుల పందెం గొడవేంటి!' అని ఆశ్చర్యపోతున్నారా? ఈ పరుగు పందెం నిజంగా వాళ్ళిద్దరికీ కాదు. వాళ్ళిద్దరి పేర్లు ఉన్న బొద్దింకలకు. అమెరికాలో కుక్కల నుంచి, ఎలకల దాకా అన్ని జీవులకు ఇలాంటి సరదా పరుగు పందాలు నిర్వహించడం మామూలే. అయితే ఇప్పుడు ఇవన్నీ బోరుకొట్టినట్టు న్నాయి వాళ్ళకి. కొత్తగా బొద్దింకల వైపు దృష్టి మళ్ళించారు. ఇటీవల న్యూజెర్సీలో ఒక బొద్దింకల పోటీ జరిగింది. 'మడగాస్కర్ హిస్సింగ్ కాక్రొచ్' అనే జాతికి చెందిన రెండు బొద్దింకలు ఈ పోటీలో అమెరికా అధ్యక్ష పదవికి పోటీదారులైన బారక్ ఒబామా, జాన్ మెకెయిన్‌లకు ప్రాతినిధ్యం వహిస్తూ పాల్గొన్నాయి. ఇంతకీ ఇందులో గెలిచింది ఎవరంటారా? మెకెయిన్ బొద్దింక చక చకామని దూసుకు పోతుంటే, ఒబామా బొద్దింక మాత్రం లైన్ దాటి అడుగు వేయటానికే మొరాయించిందట. చివరకు మెకెయిన్ బొద్దింకే విజయం పొందినట్టు ఫలితం తేల్చేసారు. అయితే ఇక ఒబామా జాగ్రత్త పడవలసిందే!



'సరసి' కత

# నారు పోసినవాడు

వైశంపాయనుడు వున్న కాలనీలో వార్షికోత్సవానికి చీఫ్ గెస్ట్‌గా ఎవర్ని పిలవాలీ అనే ప్రశ్న వస్తే మునిసిపల్ ఛైర్మన్ జనమేజయుడు గారిని వైశంపాయనుడు ప్రపోజ్ చేశాడు.అందరూ సరేనన్నారు.

కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులంతా తలో పనీ భుజాన వేసుకొని ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంకల్పించుకుని, చందాలు పోగు చేసి, స్కూలుకు రంగులు వేసి, జెండాలు కట్టి, స్టేజి డెకరేషనుతో సహా అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవం నాడు ఛైర్మన్ గారిని సాదరంగా తోడ్కొని తీసుకొచ్చారు.

ఛైర్మన్ జనమేజయుడు గారి సందేశం పూర్తయ్యాక ఆటల్లోనూ, పాటల్లోనూ నెగ్గిన పిల్లలకు వారి చేత బహుమతులు ఇప్పించారు. తర్వాత ఆయన చేత స్కూలు ఆవరణలో ఒక మొక్క నాటించారు. మొక్క నాటి, చేతులు కడుక్కుంటూ, ''ఇది పెద్దయ్యేసరికి నేనవు వుంటానో, వుండనో, నారు నేను పోశాను. నీరు మీరు పోయండి'' అని చమత్కరించారు ఛైర్మన్‌గారు. అందరూ కరతాళ ధ్వనులు చేశారు.

మర్నాడు అనుకోని పరిస్థితులు సంభవించి ఛైర్మన్ గారిని, స్కూలు హెడ్మాస్టర్నీ, కాలనీ అసోసియేషన్ సభ్యుల్ని పోలీస్ స్టేషనుకి పిలిపించారు పోలీసులు. ఛైర్మన్‌తో సహా అందరి




మీద ఒక కేసు బుక్కయింది. కేసు గురించి చెప్పి, తప్పు చేసిందెవరని ఇన్స్‌పెక్టర్ ప్రశ్నిస్తూ వుంటే నేను కాదంటే నేను కాదని అందరూ వణికిపోతూ సమాధానాలు చెప్పారు. ''అందరినీ సెల్‌లో పడేయ్యండి'' అని ఇన్స్‌పెక్టర్ హుకుం జారీ చేశాడు.

చివరకి, ఛైర్మన్ గారు హై: లెవల్‌లో ఇన్‌ఫ్లూయెన్స్ చేయించడం వల్ల అతి కష్టం మీద కేసు మాఫీ అయింది. ''అమ్మయ్య'' అని అంతా ఊపిరి పీల్చుకున్నారు. వైశంపాయనుడైతే అందరికంటే ఎక్కువ రిలీఫ్ ఫీలయ్యాడు. ఎందుకంటే ఆ తప్పు చేసింది అతడే!

పచ్చగా చూడడానికి బాగుంది కదా అని ఒక మొక్కని రోడ్డు పక్కన ఒక పిట్టలవాడి దగ్గర కొని, స్కూలుకు పట్టుకెళ్ళి, ఛైర్మన్ గారి చేత నాటించి, ఫోటోలు తీయించింది వైశంపాయనుడే.

తర్వాత తేలింది అది 'గంజాయి మొక్క' అని.

*